చెరువులను సుందరీకరిస్తాం

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ● చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు

మియాపూర్/ చందానగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చెరువుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, వాటిని సుందరీకరించి కబ్జాల బారి నుంచి కాపాడటమే కాకుండా స్థానికులకు ఆహ్లాదకర వాతావరణం అందిస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సుందరీకరణ పనుల్లో భాగంగా మియాపూర్ పటేల్‌చెరువు, గంగారంలోని పెద్దచెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులరెడ్డితో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటేల్‌చెరువు, గంగారం పెద్దచెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. చెరువు పరిసర ప్రాంతాల కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. అదే విధంగా చెరువుల సుందరీకరణలో భాగంగా చెరువుకట్ట బలోపేతం, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా కాల్వల నిర్మాణం, చెరువు పరిరక్షణలో భాగంగా చూట్టు ఫెన్సింగ్, అలుగు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ కేవీవీఎస్ రాజు, డీఈలు శిరీష, దుర్గప్రసాద్, స్రవంతి, ఏఈ సంతోష్‌రెడ్డి, ఏఎంఓహెచ్ రవికుమార్, స్ట్రీట్‌లైట్స్ ఈఈ మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చందానగర్ డివిజన్ శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు త్వరలో చేపట్టబోయే రోడ్డు విస్తరణ పనులను భవానీపురం నాలా, కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీ, అపర్ణలింక్ రోడ్డు వద్ద నిర్మాణ పనులను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాలు, కార్పొరేటర్లు మంజుల, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నోఏళ్ల సమస్య నేటితో తీరనుందన్నారు. ప్రజల సౌకర్యార్థం, ప్రజా అవసరాల దృష్ట్యా అమీన్‌పూర్‌వరకు త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. గంగారం హనుమాన్ దేవాలయం నుంచి అపర్ణహిల్ పార్క్ వరకు లింక్‌రోడ్డును త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ కేవీఎస్ రాజు, డీఈలు దుర్గప్రసాద్, స్రవంతి, ఏఈ సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.


గంగారం పెద్దచెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, జడ్సీ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీకాంత్, మంజులరెడ్డి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో సమస్యలను పరిష్కరిస్తా

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద బాచుపల్లికి చెందిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. డబుల్ ఇళ్లల్లో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సదుపాయం, ప్రహరీ గోడ నిర్మాణం, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డబుల్ ఇళ్ల లబ్ధిదారులు అశోక్, దుర్గా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై అప్రమత్తంగా ఉండాలి: డీసీ

గచ్చిబౌలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్మాతకంగా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని శేరిలింగంపల్లి ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో పారిశుధ్య నిర్వహణ సిబ్బంది, ఎస్ఎఫ్ఏలు, ఎస్ఎఫ్‌లు, ఏఎంహెచ్ఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉండి చెత్త, వ్యర్థాలు నిల్వఉండకుండా చూడాలని తెలిపారు. అదేవిధంగా నాలాలు, వరదనీటికాల్వలో వ్యర్థాలు తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం నుంచి 15 రోజుల పాటు అన్ని ప్రాంతాలు కాలనీలు, బస్తీల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఈ 15 రోజులు సిబ్బంది సెలవులు పెట్టకుండా విధుల్లో ఉండాలని, విధులకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ సురేందర్, ఎస్ఎఫ్ఏలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


సీనియర్ సిటిజన్స్ కోసం ఏర్పాటు చేసిన హోమియో వైద్యశిబిరం

వృద్ధులకు హోమియో ఉచిత వైద్యశిబిరం

ఓల్డుబోయినపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా ప్రభుత్వ హోమియా వైద్యశాల ఆధ్వర్యంలో 50 ఏళ్లు పైబడిన వృద్ధుల కొరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ (తెలంగాణ ప్రభుత్వం) ఉత్తర్వుల మేరకు బుధవారం ఉదయం ఓల్డుబోయినపల్లి చివరి బస్టాపు వద్ద ఉన్న వార్డు కార్యాలయంలో ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులకు బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, నడుమునొప్పి, అజీర్ణం, అర్షమొలలు తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్, డా.ఎస్.పార్వతి, ఫార్మాసిస్ట్ వినోదారాణి, ఏఎన్ఎం స్వరూప, ఆశా వర్కర్లు దివ్య, గుణ సుందరి సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా అధికార ప్రతినిధిగా దయాకర్


దయాకర్

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఒక్కంటి దయాకర్‌ను బుధవారం నియమించారు. ఈ పదవి ఇప్పించిన పార్టీ సీనియర్ నాయకులకు, పెద్దలకు, మేడ్చల్ జిల్లాలోని బీజేపీ నాయకులకు దయాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఏఐఏవై మూసాపేట డివిజన్ అధ్యక్షుడిగా మహేష్


నియామకపత్రం అందుకుంటున్న మహేష్‌కుమార్

ఫతేనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం మూసాపేట అధ్యక్షుడిగా కర్క మహేష్ నియమితులయ్యారు. ఈ నియామకపు ఉత్తర్వులను ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జాతీయ కో ఆర్డినేటర్ యస్.వరుణ్‌కుమార్, సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజుతో కలిసి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. తనపై ఉన్న నమ్మకంతో అధ్యక్ష పదవిని కట్టబెట్టినందుకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రాష్ట్ర కోశాధికారి ప్రమోద్‌కుమార్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్, సభ్యులు నరేష్, ప్రభుదాస్, శంకర్, ఎడ్ల నితీష్‌కుమార్, ఫణీంద్ర, భరత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కూకట్‌పల్లి మండలాధ్యక్షుడి నియామకం


నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యవర్గం

హైదర్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కూకట్‌పల్లి మండలాధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆల్విన్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలో సమావేశమైన పీఆర్‌టీయూ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘానికి ప్రధాన కార్యదర్శిగా సి.విట్టల్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా పి.రవీంద్ర, మహిళా అధ్యక్షులుగా బి.రాధిక, కార్యదర్శిగా ఆర్.వీరేందర్, మహిళా కార్యదర్శిగా ఎస్.లక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘునాథరెడ్డి, సురేందర్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

పర్వతారోహకుడు తులసిరెడ్డికి సన్మానం


తులసిరెడ్డిని సన్మానిస్తున్న భూపతిరెడ్డి

దుండిగల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిన యువకుడిని బౌరంపేట గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట గ్రామానికి చెందిన పల్సునూరి తులసిరెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఐరోపా ఖండంలో 5 వేల 6 వందల 42 మీటర్ల ఎత్తైన మౌంట్ ఎల్బర్స్ శిఖరాన్ని అధిరోహించి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం బౌరంపేటకు చేరుకున్న తులసిరెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో తులసిరెడ్డి బౌరంపేట కౌన్సిలర్ నర్సారెడ్డి భూపతిరెడ్డిని కలిసి పర్యటన వివరాలు తెలిపారు. అనంతరం తులసిరెడ్డిని కౌన్సిలర్ శాలువాతో సన్మానించారు.

కొమ్మలు నరికారు.. తొలగించడం మరిచారు


అల్లాపూర్ డివిజన్ తులసినగర్‌లో రోడ్డు పక్కన వదిలేసిన చెట్ల కొమ్మలు

అల్లాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని ఆ శాఖ సిబ్బంది ఆదివారం చెట్ల కొమ్మల్ని నరికి రోడ్డు పక్కన కుప్పలుగా వేశారు. చెట్ల కొమ్మలను వెంటనే తరలిస్తామని చెప్పిన విద్యుత్ సిబ్బంది నాలుగు రోజులు గడుస్తున్నా అలాగే వదిలేశారు. గాయత్రినగర్, తులసినగర్‌లలో ఎక్కడి కొమ్మలు అక్కడే కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. చెట్ల కొమ్మల కారణంగా బస్తీవాసులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.


మాల్‌లో ఏర్పాటు చేసిన డైనోసార్‌తో నిర్వాహకులు

మాల్‌లో 'డైనోసార్స్'

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలోని ఓ మాల్‌లో డైనోసార్స్ ప్రదర్శనను మాల్ మేనేజర్ మంగేష్‌తో కలిసి మాల్ డిప్యూటీ క్లస్టర్ డైరెక్టర్ కింజల్ రాడియా బుధవారం ప్రారంభించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు డైనోసార్స్ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు స్టడీ టూర్‌గా డైనోసార్స్ గురించి తెలుసుకునేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అలాగే విద్యార్థులకు పెయింటింగ్ వేసుకునే సౌలభ్యం కల్పించినట్లు వివరించారు. డైనోసార్స్‌తో ఫొటోలు దిగేందుకు చిన్నారులతో పాటు పెద్దలు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నెలరోజుల పాటు డైనోసార్స్ ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు.

విచారణకు హాజరైన న్యాయవాదులు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది సంతోష్‌పై బోరబండ ఎస్సై దాడి ఘటనను హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టింది. ఈ మేరకు కేసు నిమిత్తం కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రమేష్, ఇతర న్యాయవాదులు బుధవారం హైకోర్టులో విచారణకు హాజరయ్యారు. తమకు న్యాయం జరుగుతుందని న్యాయవాదులు ఆశాభావం వ్యక్తం చేశారు.


ప్రమాదంలో గాయపడిన వంశీని పరామర్శిస్తున్న బండి రమేష్

రోడ్డు ప్రమాదానికి గురైన కార్యకర్తను పరామర్శించిన బండి

బాలానగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ కార్యకర్త తాటికొండ వంశీని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులతో కలిసి వచ్చి అతడిని బుధవారం పరామర్శించారు. ఆరోగ్యం కుదుటపడే వరకూ రెస్టు తీసుకోవాలని సూచించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, తూము వేణు, శ్రీకాంత్‌గౌడ్, శివకుమార్‌గౌడ్ బండి రమేష్ వెంట ఉన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

● భర్తతో గొడవపడి మరో మహిళ

చందానగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనలు చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన వరలక్ష్మి(34)కి సత్యశివప్రసాద్‌తో ఆరునెలల క్రితం వివాహం అయింది. వీరు చందానగర్ కైలాస్‌గర్‌లో నివాసం ఉంటున్నారు. నగరంలోని పీఎస్ఆర్ ల్యాబ్‌లో పని చేస్తున్నారు. వీరికి పెళ్లికి ముందు చేసిన అప్పులు తీర్చలేక భయాందోళనకు గురైన ఆమె మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. భర్త సత్యశివప్రసాద్ చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

● భర్తతో గొడవపడి..

లింగంపల్లి వెంకటరెడ్డి కాలనీలో నివాసం ఉండే నాగమల్లేశ్వరరావు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కోదాడకు చెందిన విజయ(40)తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. వీరు తరుచుగా చిన్నచిన్న మనస్పర్థలతో గొడవ పడేవారు. మంగళవారం ఉదయం నాగమల్లేశ్వరరావు ఆఫీస్‌కు వెళ్లే సమయంలో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో ఆమె గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. భర్త చొక్కా తీసుకుందామని తలుపులు తెరవడంతో విజయ ఉరి వేసుకుని కనిపించింది. దీంతో ఆమెను కిందకు దించి చికిత్స నిమిత్తం చందానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకి..

జీడిమెట్ల: కుటుంబకలహాలతో ఓ వ్యక్తి వాటర్ ట్యాంక్ పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిస్సా ప్రాంతంలోని కాశీనగరానికి చెందిన బవిరి రాము(53) మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రాముకు నిత్యం మద్యం తాగే అలవాటు ఉంది. 15 రోజుల క్రితం అతిగా మద్యం తాగి వచ్చిన రాము భార్యతో గొడపడ్డాడు. దీంతో భార్య పిల్లలను తీసుకుని వెళ్లిపోయి వేరేచోట గది అద్దెకు తీసుకుని ఉంటుంది. దీంతో రాము తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 16వ తేది నాడు భార్య, పిల్లలు తమ సొంత గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. అప్పటి నుంచి తాగుతున్న రాము ఈనెల 19వ తేదీ ఉదయం కుత్బుల్లాపూర్ పోచమ్మ ఎల్లమ్మ ఆలయం సమీపంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి దూకాడు. దీంతో తీవ్రగాయాలైన రామును ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. శవాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన మనీష్‌కుమార్‌సింగ్(39) బతుకుదెరువు కోసం వచ్చి బాలానగర్ రాజు కాలనీలో ఐదేళ్లుగా నివాసం ఉంటూ దూలపల్లి పారిశ్రామికవాడలోని శ్రీదుర్గ మెటల్స్‌లో పని చేస్తున్నాడు. మనీష్‌కుమార్‌సింగ్‌కు భార్య ఇద్దరు పిల్లలున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం డ్యూటీకి వెళ్లాడు. పరిశ్రమలోని కరెంట్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మనీష్‌కుమార్‌సింగ్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. విషయం గమనించిన తోటి కార్మికులు, యాజమాన్యం సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యులు, భార్య ఆశాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఐఏఎస్, ఐపీఎస్ ప్రైవేటైజేషన్ దుర్మార్గం

లేటరల్ ఎంట్రీ విధానాన్ని ఎత్తివేయాలి : ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటైజేషన్ చేయడం దుర్మార్గమైన చర్య అని, ఈ విధానానికి మోదీ ప్రభుత్వం తక్షణమే స్వస్తి పలకాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కులగణనపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర కేబినెట్ లేటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా 45 మందిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో భర్తీ చేయాలని నిర్ణయించడం ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటైజేషన్ చేయడమేనని ధ్వజమెత్తారు. ఈ విధానం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులు దక్కకుండా మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికే కేంద్రంలో 1,670 ఐఏఎస్, 1,482 ఐపీఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయకుండా దొడ్డిదారిన రాజకీయ కార్యకర్తలను భర్తీ చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలో భాగమే లేటరల్ ఎంట్రీ విధానం అని, దీన్ని ఎత్తివేయకపోతే దేశాన్ని స్తంభింపజేస్తామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. దీనిపై ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

కదం తొక్కిన కార్మికులు

మధ్యాహ్న భోజన పథకాన్ని 'హరేకృష్ణ'కు అప్పగించొద్దు

ఖైరతాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఆ పథకం కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులు సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్లే అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దాదాపు 430 మంది కార్మికులను ఖైరతాబాద్ పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి, బోయిన్‌పల్లి, షాయ్‌నాత్‌గంజ్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లతో పాటు హెడ్ క్వార్టర్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) అధ్యక్షురాలు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి రమ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది కార్మికులు 24 సంవత్సరాలుగా ఎన్నో కష్టనష్టాలకోర్చి పని చేస్తుండగా ప్రస్తుతం వారందరి బతుకులు బజారున పడేలా ముఖ్యమంత్రి హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్‌కు మధ్యాహ్న భోజన పథకం మొత్తాన్ని అప్పగించేందుకు వారితో ఒప్పందం జరుపుకొనేందుకు సమాయత్తమయ్యారని ఆరోపించారు. గత ఎన్నికల వాగ్దానాల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెలా రూ.10 వేల వేతనం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువు


సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

చార్మినార్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదులకు రక్షణ కరువైందని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆగస్టు 24న సిటీ సివిల్ కోర్టులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కోర్టు ప్రాంగణంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల బోరబండ, సిద్దిపేట, జనగామలో వరుసగా న్యాయవాదులపై పోలీసుల దాడులు జరిగాయని, ప్రభుత్వం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జిల్లాలలోని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు న్యాయవాదులు, బర్కా రాజేష్ కుమార్, సుధాన్సు, విశాల్ సింగ్, ప్రవీణరెడ్డి, జశ్వంత్ కౌర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు,

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా


సామూహిక నిరాహారదీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కవాడిగూడ,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న టీచర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హామీ ఇచ్చారు. మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఉపాధ్యాయులు సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 12 ఏళ్ల నుంచి ఎందుకు ప్రమోషన్స్ ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. టీజీటీలను జూనియర్ లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బి.కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.మహేష్ మాట్లాడుతూ.. సర్వీసులో మరణించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకే నియామక పరీక్ష ద్వారా ఎంపికై ఆలస్యంగా నియామకం పొందిన ఉపాధ్యాయులకు వేతన వత్యాసాలు తొలగించేందుకు నోషనల్ సర్వీస్ కల్పించాలన్నారు. నిరాహార దీక్షలో టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి, ఫెడరేషన్ కోశాధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

చందానగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌లో గృహిణి అదృశ్యమైంది. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. నారాయణఖేడ్‌కు చెందిన జ్ఞానేశ్వర్, సోనియాభాయి(28) భార్యాభర్తలు. వీరికి పదేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి కొడుకు, కూతురు ఉన్నారు. జీవనోపాధి కోసం లింగంపల్లికి వచ్చి తారానగర్‌లో నివాసం ఉంటూ గప్‌చుప్‌ల బండి నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం సోనియాభాయి భర్తతో గొడవపడి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం: గాజులరామారం సబ్-స్టేషన్ మోట్కాన్‌గూడ, ఉషోదయ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీవెన్ఎన్‌క్లేవ్, ఆదర్శనగర్, జయరామ్‌భూమినగర్, బాలజీ లే-అవుట్ చిత్తారమ్మదేవి టెంపులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య భార్గవ్ బుధవారం తెలిపారు.


బోర్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ప్రభుత్వ స్కూల్‌లో పవర్ బోర్ పనులు ప్రారంభం

హైదర్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పవర్ బోరు పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నీటి సమస్యల తీర్చడానికి బోర్ వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, హై, ప్రైమరీ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు నరసింహులు, సుందరరావు తదితరులు ఉన్నారు.

● శంషీగూడ వార్డు కార్యాలయంలో మెదడువాపు వ్యాధి నివారణ కోసం చిన్నారులకు టీకాలు వేశారు. 9 నెలల నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అందరికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

షాపూర్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు నిరసనగా చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం శివాలయ నగర్‌లోని అంబేడ్కర్ భవన్ వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి మాల నాయకులు పెద్దసంఖ్య హాజరయ్యారు. ముఖ్య అతిథిగా దళిత సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు అవిజే డాక్టర్ జేమ్స్ పాల్గొన్నారు. సంఘ నాయకులు అంబేడ్కర్ భవనం ఎదురుగా సూరారం మెయిన్‌రోడ్డులో నిరసన చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రెసిడెంట్ మిద్దెల సత్యనారాయణ, అడ్వైజర్ బుచ్చయ్య, మీసాల బుచ్చయ్య ఆగమయ్య, జీవరత్నం, డేవిడ్, సత్యనారాయణ, నర్సింగరావు, రామచందర్, భిక్షపతి, మహిళా అధ్యక్షురాలు, అరుణలత, అనిత, విజయమ్మ పాల్గొన్నారు.


సూరారం ప్రధాన రహదారిలో నిరసనలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్స్‌గా ఎన్వీ రమణ

ఐక్యూఏసీ ఇన్‌చార్జిగా ఎంవీవీఎస్ గిరిధర్ నియామకం


ప్రొ.ఎన్వీ రమణ


ప్రొ.గిరిధర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అకడమిక్ అండ్ అఫిలియేషన్స్ (డీఏఏఎఫ్) డైరెక్టర్‌గా ఎలక్ట్రికల్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణ నియమితులయ్యారు. అలాగే, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగం (ఐక్యూఏసీ) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా వాటర్ రిసోర్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీవీఎస్ గిరిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ వెంకటేశ్వర రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉత్తర్వులు అందుకున్న వెంటనే అకడమిక్ అఫిలియేషన్స్ విభాగం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఎన్వీ రమణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంజనీరింగ్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాలు మెరుగయ్యే విధంగా బీటెక్ సిలబస్‌లో మార్పులు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కాగా, యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న మంథని జేఎన్టీయూ కాలేజీ ఎలక్ట్రికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ దుర్గారావును హైదరాబాద్ జేఎన్‌టీయూ కాలేజీ ఎలక్ట్రికల్ విభాగానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ మరొక ఉత్తర్వు జారీ చేశారు. తాజా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. అయితే, ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న కీలక పోస్టుల్లో అర్హత కలిగిన ప్రొఫెసర్లను నియమించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేయడంతో తాజా ఉత్తర్వులు వెలువడినట్లు తెలుస్తోంది.